క్లుప్తంగా

అమ్మవారికి పల్లకీ సేవ



పల్లకీలో ఆశీనులైన స్వామిఅమ్మవార్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్ఛరణలతో ప్రత్యేక పూజలు చేశారు. మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో దేవస్థాన అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

27 నుంచి డీవైఎఫ్ఐ రాష్ట్ర శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

ఆత్మకూరు: నంద్యాల పట్టణంలో ఈనెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు డీవైఎఫ్ఐ రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్, జిల్లా నాయకులు శివ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ధనుంజయ మీటింగ్‌హాల్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయ పరిణామాలు, యువత చెడిపోవడానికి ముఖ్య కారణాలు, సమాజంలో జరిగే దోపిడీ, దారుణాల గురించి ప్రొఫెసర్లు, విద్యావంతులు, మేధావులు వివరిస్తారన్నారు. సమావేశంలో నాయకులు జబీబుల్లా, కాశీ, మౌలాలి, వరాలు, ఆలీ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామ మాజీ సర్పంచ్ కురువ రంగన్న (90) ఆదివారం మృతి చెందాడు. ఆయన వరుసగా రెండు పర్యాయాలు గ్రామానికి సర్పంచుగా పనిచేశారు. పార్టీలకతీతంగా అందరిచే మన్ననలు పొందారు. 2012 నుంచి 2021 వరకు ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మండలంలోని వివిధ పార్టీల నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

డ్రైనేజీలలో పూడిక తొలగింపు



సున్నిపెంటలో పూడిక తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీలలో పూడికను తొలగిస్తున్నారు. వరద నీరు, మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో చెత్తా, చెదారం, వ్యర్థాలు రోడ్లపైకి చేరుతున్నాయి. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఆదివారం డ్రైనేజీ పూడికతీత పనులను పెద్ద మసీదు ప్రాంతం నుంచి మొదలు పెట్టారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం



అంగరంగ వైభవంగా శ్రీనివాస స్వామి కల్యాణం

నందికొట్కూరు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం ఉదయం శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల పర్యవేక్షణలో నారాదముని కమిటీ, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం 6 గంటలకు పూరి జగన్నాథ స్వామి ఊరేగింపు, చౌడేశ్వరిదేవి ఆలయం వరకు కోలాటంతో భక్త బృందం వేడుకలు చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు ప్రవీణ్‌ప్రభు, వేద పండితులు సుధాకర్‌శర్మ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాగ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహానంది అభివృద్ధికి సహకరించండి

మహానంది: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని మహానంది మండల జనసేన నాయకులు మారెడ్డి రామయ్య, చందు, మల్లికార్జున, గురునాథ్ తదితరులు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. నంద్యాల పట్టణానికి వచ్చిన మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి మహానంది ఆలయ విశిష్టతను వివరించారు. నంద్యాల జిల్లాలో శ్రీశైలం తర్వాత అతి పెద్ద ఆలయం మహానంది అని, మరింత అభివృద్ధి చేయాలని కోరారు.

ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

- లా అండ్ ఆర్డర్ అంటే ఎంటో చూపిస్తామన్న పవన్‌కల్యాణ్ ఎక్కడ ?
- నందికొట్కూరులో సీపీఐ శ్రేణుల నిరసన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి



పటేల్ సెంటర్‌లో నిరసన చేపట్టిన సీపీఐ నాయకులు

పగిద్యాల: మైనర్ బాలిక ఆచూకీని కనిపెట్టడంలో ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి అన్నారు. ఆయన ఆదివారం మండలంలోని కొత్త ఎల్లాల గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం మాట్లాడుతూ.. ఆడుకోవడానికి వెళ్లిన తొమ్మిదేళ్ల బాలిక అదృశ్యమై ఎనిమిది రోజులు గడుస్తున్నా ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి చేయడం లేదనేందుకు ఈ దర్యాప్తు సాక్ష్యమన్నారు. ప్రస్తుతం పోలీసు శాఖలో అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినా బాలిక ఆచూకీని ఎందుకు కనిపెట్టలేకపోతున్నారని ప్రశ్నించారు. గతంలో ఏ చిన్న సంఘటన జరిగినా ఒంటికాలిపై లేచే రాష్ట్ర హోంమంత్రి అనిత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఈ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. పేదల ప్రాణాలంటే అంత చులకనా అంటూ ఆవేదనను వెలిబుచ్చారు. ఎనిమిది రోజులుగా ఆ కుటుంబం ఎదుర్కొంటున్న మానసిక క్షోభ ప్రభుత్వానికి పట్టదా అంటూ నిప్పులు చెరిగారు.

టీడీపీ దుష్ట రాజకీయం

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బాధితులను పరామర్శించేందుకు అతని స్వగ్రామానికి బయలుదేరితే మార్గంమధ్యలో అరెస్ట్ చేసి బ్రాహ్మణకొట్కూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి రాజకీయం చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. మానవతా దృక్పథంతో పరామర్శించడం నేరమన్నట్లు ఊర్లోకి వెళ్లకుండా నిలువరించడం టీడీపీ దుష్టరాజకీయానికి తార్కాణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా, 5 ఎకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త ఎల్లాల గ్రామంలో తొమ్మిదేళ్ల బాలికపై అఘాయిత్యం ఘటనలో ప్రజాసంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు కోకిల రమణారెడ్డి, కాటం రమేష్ కుమార్‌రెడ్డి, రమణ, మండ్ల మురళీ, కురుమన్న, సీపీఎం నాయకులు రాజు తదితరులు ఉన్నారు.

వరుస అఘాయిత్యాలపై చర్యలేవీ

నందికొట్కూరు: అధికారంలోకి వస్తే లా అండ్ ఆర్డర్ అంటే ఏమిటో చూపిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎక్కడ అని సీపీఐ జిల్లా నాయకులు రఘురామూర్తి, సీపీఐ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి రజిత ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని పటేల్ సెంటర్‌లో ముచ్చుమర్రి సంఘటన, విజయనగరం జిల్లాలో జరిగిన సంఘటనలపై సీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముచ్చుమర్రిలో బాలిక సంఘటన మరువకముందే విజయనగరం జిల్లాలో 5 నెలల బాలికపై వృద్ధుడు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై ఏమి చర్యలు తీసుకున్నారో పవన్‌కల్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాలికలు, పసికందులు, మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా మొద్దునిద్ర వీడరా అని ప్రశ్నించారు. ముచ్చుమర్రి ఘటనలో 8 రోజులు గడిచినా బాలిక ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సీపీఐ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం అకుంఠిత దీక్ష



శ్రీశైలంలోని పాతాళగంగ నీటిని బిందెలతో తీసుకొస్తున్న నందికొట్కూరు వాసులు

జూపాడుబంగ్లా: శ్రీశైల పాతాళగంగ నీటితో గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం చేస్తే వర్షం కురుస్తుందనే నమ్మకంతో నందికొట్కూరు పట్టణంలోని కుర్వపేటవాసులు కాలినడకన పాతాళగంగ నీటిని తీసుకొచ్చారు. మార్గమధ్యలో ఆదివారం జూపాడుబంగ్లాకు చేరుకున్న వారిని సాక్షి పలకరించగా తమ దీక్ష గురించి వివరించారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వర్షాల్లేక ఎండిపోతుండటంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని, పెద్దలు చెప్పిన సూచనల మేరకు మూడు రోజుల క్రితం పట్టణంలోని కుర్వపేట, రెడ్ల కాలనీకి చెందిన 26 మంది ఆటోలో శ్రీశైలం వెళ్లి అక్కడి పాతాళగంగలో స్నానం ఆచరించి కొత్త బిందెల్లో గంగను పట్టుకొని శ్రీశైల మల్లన్న స్వామివారి దర్శనానంతరం కాలినడకన స్వగ్రామాలకు బయలుదేరినట్లు తెలిపారు. పాతాళ గంగ నీటితో గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం చేస్తే వర్షం కురుస్తుందనే నమ్మకంతో నందికొట్కూరు పట్టణానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. సోమవారం ఉదయం గ్రామంలోని దేవతామూర్తులకు జలాభిషేకం, పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.


వర్షం వస్తే విద్యార్థులకు అవస్థలే!



పాఠశాల ముందు చెరువును తలపిస్తున్న దృశ్యం

మహానంది: కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు, చెరువును తలపించేలా వర్షపునీరు నిలుస్తుండటంతో గ్రామస్తులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. బండిఆత్మకూరు మండలం నారాయణాపురంలోని ప్రాథమిక పాఠశాల ఎదురుగా ప్రధాన రహదారిపై ఆదివారం వర్షపు నీరు నిలిచి పోయింది. దీంతో విద్యార్థులతో పాటు గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. అధికారులు స్పందించి డ్రైనేజీ ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



చావిడిలో కొలువుదీరిన పీర్ల స్వాములు



ఉప్పలదడియ గ్రామంలో కొలువుదీరిన పీర్ల స్వాములు

మిడుతూరు: మండలకేంద్రం మిడుతూరుతోపాటు 49- బన్నూరు, ఉప్పలదడియ, చౌట్కూరు, మాసపేట, తదితర గ్రామాల్లో పీర్ల చావిళ్లను ప్రత్యేకంగా ముస్తాబు చేసి పీర్లను కొలువుంచారు. మిడుతూరులో మౌలాలి స్వామి సరిగెత్తు వేడుకలు, తిమ్మాపురం గ్రామంలో హుసేనాళం సరిగెత్తు, మాసపేట గ్రామంలో అలె అక్బర్ స్వామి సరిగెత్తు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో ఆదివారం మొహర్రం వేడుకల్లో భాగంగా చిన్న సరిగేసు కార్యక్రమం జరిగింది. గ్రామంలో భక్తులు పీర్ల స్వాములకు దట్టీలు, పూల షేరాలు, కాయ, కర్పూరాలు సమర్పించారు. రాత్రి దున్నపోతుల పీరుస్వామికి సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. డప్పుల హోరుతో గ్రామంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

జూపాడుబంగ్లా: మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం మండలంలోని తాటిపాడు, 80బన్నూరు, తంగడంచ, మండ్లెం, తర్తూరు, పారుమంచాల తదితర గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో చిన్న సరిగెత్తు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పీర్లచావిడిల్లో కొలువుదీరిన అలీ, అక్బర్ పీర్లను పూనకం పూనిన వ్యక్తులు ఎత్తుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల్లోని దర్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అనంతరం పీర్లను చావిడిలో కొలువుంచారు.

మహానందిలో సందడి

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవు రోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్థానిక రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకొని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి



సబ్‌జైల్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ఆయా కేసుల్లో జైలుకు వచ్చిన ఖైదీల ప్రవర్తనలో మార్పులు రావాలని సబ్ జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని సబ్‌జైల్‌లో ఎన్‌జీఓ ఆధ్వర్యంలో ఖైదీలకు డాక్టర్లు, న్యాయవాదులు కౌన్సెలింగ్ ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌జీఓ సంస్థలు ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. న్యాయవాదులు, డాక్టర్లు, ఎన్‌జీఓ సంస్థలు ఇచ్చే సలహాలు పాటించి సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు. ఎన్‌జీఓ సభ్యులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు

- ప్రయాణికులకు ఇబ్బందులు
- దూర ప్రాంతాలకు వెళ్లే వారికి అవస్థలు



బస్సులు నిలపకపోవడంతో నిరుపయోగంగా మారిన జూపాడుబంగ్లా ఆర్టీసి బస్టాండు

జూపాడుబంగ్లా: రోడ్డు రవాణా సంస్థ ఎటా నష్టాల్లో కూరుకుపోతుందంటే దానికి కారణం ఆ సంస్థ అధికారులు, సిబ్బంది అవలంభించే చర్యలేనని ప్రయాణికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రమైన జూపాడుబంగ్లా ఆర్టీసీ బస్టాండులో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కర్నూలు, ఆత్మకూరు, నంద్యాల, తదితర ప్రాంతాలకు చెందిన అధికారులు జూపాడుబంగ్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. వారు నిత్యం జూపాడుబంగ్లా నుంచి కర్నూలు, ఆత్మకూరు, నంద్యాల, నందికొట్కూరు, వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరితో పాటు సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు నిత్యం ఉంటారు. అయితే స్థానిక బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపకపోవడం వల్ల వారందరూ ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని తంగెడంచ, తాటిపాడు, జూపాడుబంగ్లా, 80బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం, పోతులపాడు తదితర గ్రామాల నుంచి కర్నూలు, శ్రీశైలం, ఆత్మకూరు, డోన్, ఆదోని, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి సుదూర ప్రాంతాలకు వెళాల్సిన వారు జూపాడుబంగ్లాలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపుతారనే ఉద్దేశంతో ఇక్కడి బస్టాండ్ వద్దకు చేరుకొని ఎక్స్‌ప్రెస్ బస్సులకోసం వేచిచూస్తుంటారు. అయితే ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, కర్నూలు-1, 2, ఆత్మకూరు డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు ఏపీ బస్టాండులో ఆపకుండానే వెళ్తుండటంతో ప్రయాణికులు విసిగిపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోండని పేర్కొంటున్న అధికారులు సకాలంలో బస్సులు నడపకపోవటంతోపాటు ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలపకపోతే తాము ఎలా ప్రయాణించాలని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై జూపాడుబంగ్లా మండల సర్వసభ్య సమావేశంలో అనేకమార్లు సభ్యుల ఆమోదంతో తీర్మానం చేసి కర్నూలు రీజనల్ మేనేజర్ కార్యాలయానికి పంపినా వారు ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలిపేలా చర్యలు తీసుకోవడం లేదని స్థానిక నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు రవాణా సంస్థ జిల్లా అధికారులు చర్యలు తీసుకొని మండల కేంద్రమైన జూపాడుబంగ్లా ఆర్టీసీ బస్టాండులో అన్ని డిపోలకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని వివిధ గ్రామాల ప్రయాణికులు, ప్రజలు, అధికారులు కోరుతున్నారు.

21న సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని సాయిబాబా దేవాలయంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. సాయిబాబాకు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

గిరిజనులకు పక్కాగృహాలు నిర్మించాలి



కొత్తసిద్దేశ్వరం గిరిజనులతో కలిసి మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు

జూపాడుబంగ్లా: పారుమంచాల మజారా గ్రామమైన కొత్తసిద్దేశ్వరం గ్రామంలోని గిరిజనులకు పక్కాగృహాలు నిర్మించాలని సీపీఐ జిల్లా నాయకుడు రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గిరిజనులకు ఇప్పటిదాకా స్థలాలు కేటాయించి ఇళ్లపట్టాలిచ్చిన దాఖలాల్లేవన్నారు. 40ఏళ్ల నుంచి గ్రామానికి చెందిన గిరిజనులకు పక్కా గృహాల్లేకపోవడంతో పూడిగుడిసెల్లోనే కాలం వెలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు నివసిస్తున్న చోట కనీస మౌలిక సదుపాయాల్లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకొని కొత్తసిద్దేశ్వరం గ్రామానికి చెందిన గిరిజనులకు ఇళ్లస్థలాలు కేటాయించి పట్టాలివ్వటంతో పాటు వారికి పక్కాగృహాలు నిర్మింపజేసి ఆదుకోవాలని కోరారు.



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: మండల కేంద్రం ఆత్మకూరులో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శని, ఆదివారాలు ఒక మోస్తారు నుంచి భారీగా వర్షాలు కురిశాయి. శనివారం 9.8 మి.మీ. వర్షం కురవగా, ఆదివారం వేకువజామున 14.8 మి.మీ. వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు విడతలు, విడతలుగా వర్షం కురుస్తుండడంతో ఇప్పటికే రైతులు సాగుచేసిన పత్తి, మొక్కజొన్న, కంది పంటల్లో కలుపు తీసేందుకు రైతులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. భారీగా వర్షాలు రావడంతో పలు చెరువులు నిండాయి. సిద్ధాపురం చెరువకు నీరు రావడం, నల్లకాల్వ, కరివేన, ఇందిరేశ్వరం చెరువులు కళకళలాడుతున్నాయి.

వారపు సంతకు వాన కష్టాలు



వర్షంలోనే వారాంతపు సంతలో వ్యాపారులు, వినియోగదారులు

పాములపాడు: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన వారపు సంతకు వాన కష్టాలు తప్పలేదు. సాయంత్రం వేళ కూరగాయలు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు మండల కేంద్రంతో పాటు చుట్ట పక్కల గ్రామాల ప్రజలు వస్తారు. అయితే సాయంత్రం కురిసిన చిరుజల్లులతో వినియోగదారులు, వ్యాపారులు ఒకింత ఇబ్బందులు పడ్డారు. అదేపనిగా కురుస్తున్న చిరుజల్లులతో కూరగాయల వ్యాపారులు, గొడుగులు, టార్పాలిన్ పట్టలు అడ్డుగా ఉంచుకొని వ్యాపారం చేశారు. చిరుజల్లులతో పాటు వాతావరణం చల్లగా ఉండటంతో వణకడం వారి వంతైంది. ఎంతటి వర్షం కురిసినా తెచ్చుకున్న కూరగాయలు విక్రయించుకోకపోతే నష్టాన్ని చవిచూడాల్సిందే. మళ్లీ వచ్చే ఆదివారం వరకు సంత ఉండదు. వినియోగదారులు సైతం వారం రోజులకు సరిపడా కూరగాయలు కొనాల్సిందే. లేదంటే ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఏదేమైనా వర్షంలో తడుస్తూ వారాంతపు సంత కొనసాగింది.



పాఠశాల వద్ద తమ పిల్లలతో ముచ్చటిస్తున్న తల్లిదండ్రులు



బిడ్డకు తల దువ్వుతున్న తల్లి, కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మరో విద్యార్థిని

అమ్మ... అనురాగం

మండల కేంద్రం తిమ్మాపురం కస్తూరిబా పాఠశాల ప్రాంగణంలో ఆదివారం పండుగ సందడి నెలకొంది. విద్యార్థినులు, తల్లిదండ్రులతో కోలాహలం సంతరించుకుంది. ఏంటీ సందడి అనే ఆలోచన మొదలైంది. అంతలోనే ప్రతి నెలా రెండో ఆదివారం తమ పిల్లలను కలిసేందుకు అవకాశం అధికారులు కల్పించిన విషయం గుర్తొచ్చింది. ఓ అమ్మ తనచిన్నారిని అక్కున చేర్చుకుని మురిసిపోతుండగా... మరో తల్లి తన బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తూ మైమరిచిపోతుండగా... చిన్నారికి తలదువ్వే పనిలో నిమగ్నమైంది ఇంకో మాతృమూర్తి. అమ్మను చూసిన చిన్నారుల సంతోషం వర్ణనాతీతం....
ఓ వైపు అమ్మ గోరుముద్దలు తింటూనే మరోవైపు కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న తీరు ఆకట్టుకుంది. అమ్మ... అనురాగం అంతే అనేలా ఉందా సందడి.. దీంతో ఆ దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది. – మహానంది



కుమార్తెకు డబ్బులు ఇస్తున్న ఓ తల్లి